వైరాగ్యంతో సరాగం

ఆషాఢమాసంలో ప్రథమ దివసంలాంటి రోజు. నీలాంబరాన కాలాంబుదాలలముకుంటున్నాయి. ఉదయం పదిగంటలు కావస్తున్నా వాన వాసనతో మిళితమై హేమంత కాలపు శీతలపవనం కిటికీలగుండా లోపలికి వీస్తోంది. నేను గదిలో ప్రవేశించేసరికి మాధవయ్య మామ కిటికీ దగ్గరగా నిల్చుని మదపుటేనుగుల్లా కదులుతున్న మబ్బులకేసి చూస్తున్నాడు.

"మబ్బుల్లో యేముంది గానీ యిలా వచ్చి కుర్చీలో కూర్చో మామయ్యా! పెద్దవాళ్ళ దగ్గరికి వస్తూ రిక్తహస్తాలతో రాకూడదని నీకోసం ఓ కానుక కొని తీసుకొచ్చాను" అన్నాను.

గది మధ్యకు వచ్చి వాలుకుర్చీలో చేరగిలబడుతూ "ఏం తీసుకొచ్చావురా అబ్బీ!" అన్నాడు మాధవయ్య మామ.

"ఏం తెచ్చానో చెప్పుకో చూద్దాం" అన్నాను.

మాధవయ్య మామ వరుసగా నాలుగైదు వస్తువుల పేర్లు చెప్పాడు. గురిపెట్టి కొట్టలేని వేటగాడి బాణంలా ఆయన ఊహ ప్రతిసారీ తప్పిపోయింది. "నువ్వు చెప్పుకోలేవులే మామయ్యా!" అంటూ జేబులోనుంచీ పొగచుట్టలు పైకి తీశాను.

"పొగచుట్టలా!" అన్నాడు మాధవయ్య మామ. అంటూ ఆయన ఉలికిపడ్డాడు. "నేను పొగచుట్ట కాల్చాలనుకుంటున్నానని నీకెలా తెలిసింది రామం?" విస్మయంతో ప్రశ్నించాడు.

"ఓయబ్బో. ఆ మాత్రం తెలుసుకోడానికిగూడా గొప్ప తెలివితేటలు కావాలా మామయ్యా! నువ్వు అడపాదడపా బీడీలు కాలుస్తావని నాకు తెలుసు. ఉత్తరధ్రువం వలస వచ్చేసినట్టున్న ఈ వాతావరణంలో నాసిరకం బీడీలేం బాగుంటాయని చుట్టలు కొనుక్కొచ్చాను" అన్నాను.

వెంటనే ఓ చుట్ట ముట్టించి పొగకోసం ముఖం వాచిపోయినవాడిలా నాలుగు గుక్కలు పీల్చి ఒక్కసారిగా పొగనంతా బయటికి వదిలేశాడు మాధవయ్యమామ. నిండుగా, బొద్దుగా, నల్లగా నుదుట పట్టెనామాలతో వెంకటాచలపతిని తలపించే విగ్రహం మాధవయ్య మామది. ధూమమాలికలు ఎక్కడి వక్కడే తెగిపోయి ఒక్కొక్కటీ ఒక నర్తకిలా ఆయన చుట్టూ గాలిలో ఒయ్యారాలు పోతున్నాయి. వినోదకరమైన దృశ్యం! చూస్తూ కూర్చున్నాను.

"చుట్ట కాలుస్తుంటే నాకో కథ జ్ఞాపకం వస్తోందిరా రామం!" నిద్రలోనుంచి మేలుకున్నట్టుగా అన్నాడు మాధవయ్య మామ.

"చెప్పు మామయ్యా!" అంటూ కుర్చీ దగ్గరికి జరుపుకున్నాను.

పొగచుట్ట ఓ అంగుళం మేరకు కాలి కొడిగట్టిపోయింది. నుసిని క్రింద రాల్చేస్తూ ప్రారంభించాడు మాధవయ్య మామ.

"ముప్ఫయియేళ్ళ క్రిందటిమాట. ఓరోజు అర్ధరాత్రివేళ. కటిక చీకటి. పైగుడ్డ విదిలించి భుజాన వేసుకుని వూరు వదిలి వెళ్ళిపోయాను. బ్రతుకంటే భయమైపోయింది నాకు. సంసార బాధలకంటే నరకయాతనలు గూడా నయమనిపించాయి. పెళ్ళాం,

బిడ్డలు శత్రువుల్లా కనిపించారు. ఉన్నవూరు వల్లకాడులా గోచరించింది. ఆ రోజంతా మా యింట పొయ్యిలో పడుకున్న పిల్లి పైకి లేచిందిగాదు. షావుకారు చెంచయ్య నడివీధిలో నిలవేసి నాలుగు రోజుల్లో అప్పు చెల్లించకపోతే కోర్టుకు వెళ్తానన్నాడు. పొలం దగ్గరికి వెళ్తే బావిలో నీళ్ళులేక వేసిన పైరు మాడిపోతోంది. ప్రొద్దుండగా వూళ్ళోకి తిరిగిరావడానికి మనస్కరించక బాగా చీకటిపడిన తర్వాత తిరిగి వచ్చాను. అంగవస్త్రం పరచుకుని అరుగుపైన పడుకున్నాను. మానవుడికి కష్టమో, సుఖమో కాలం గడవకుండా ఉండదు. తెల్లవారుతుంది. తెల్లవారిన తర్వాత ఏం చేయాలి? పొలానికి వెళ్ళి చేయగలిగిందేమీ లేదు. ఊళ్ళో అప్పుపుట్టదు. కట్టుకున్న పెళ్ళాం ఎదుట నేరం చేసినవాడికిమల్లే నిల్చోవాలి. తలవంపులు, నగుబాట్లు, ఈతిబాధలన్నీ ఒక్కుమ్మడిగా పెడబొబ్బలు పెడుతూ నన్ను తరుముతున్నాయి. మన వూరికీ, స్టేషనుకూ పదిమైళ్ళు. రెండు గంటల్లో అంతదూరం ఎలా వెళ్ళానో నాకు తెలియదు. వెళ్ళిన కొంతసేపటికల్లా రైలు వచ్చింది. ఓ పెట్టెలో ఎక్కి కూర్చున్నాను. మరునాటి పగలంతా ఆ ప్రయాణం కొనసాగింది. సాయంత్రానికి టిక్కెట్టు లేదని చెప్పి నన్నొక స్టేషనులో దింపేశారు. కడుపునిండుగా కొళాయిలో నీళ్ళు త్రాగాను. చల్లటి నాపరాళ్ళపైన పడుకున్నాను. నిద్ర ముంచుకొచ్చేసింది. కళ్ళు తెరిచేసరికి స్టేషనులో దీపాలు వెలుగుతున్నాయి. అప్పుడే ఓ పొగబండి స్టేషనులోకి వచ్చి ఆగింది. ఈసారి ఒక చిన్నపెట్టెగాచూచి సీటు క్రింద దూరి ముసుగు బిగదన్నేశాను. నిండుగా ఒక్క పగలూ, ఒక్క రాత్రి ఆ పెట్టెలోనే ఉండిపోయాను. కొత్తగా పెళ్ళిచేసుకున్న ఓ అబ్బాయి, అమ్మాయీ తాము తెచ్చుకున్న అన్నంలో నాకూ కొంచెం పంచిపెట్టారు. రైలు పరుగెడుతోందని మాత్రమే నాకు తెలుసు. ఎక్కడ పరుగిడుతోందో, ఏ వైపుగా పరుగిడుతోందో తెలియదు. ఎలాగూ నా దగ్గర టిక్కెట్టు లేదు గనుక ఎవరైనా దింపేస్తే దిగిపోదామనుకున్నాను. ఎవ్వరూ నా జోలికి వచ్చారుగారు. చివరికొక స్టేషనులో రైలాగింది. ఎంతకూ కదిలే సూచనలు కనిపించలేదు. దిగి పట్టణంలోకి వెళ్ళాను. మన ప్రాంతంగాదు. మన మనుషులుగాదు. మన భాషగాదు. బాగా మునిగిన తర్వాత చలి ఉండదంటారు. అందుచేతనే గావచ్చు నాకప్పుడు దుఃఖం కలుగలేదు. అక్కడ నాకు తెలిసిన ముఖాలు లేవు. ఏ యింటి ముంగిటకైనా వెళ్ళి చేతులుసాచి యాచించవచ్చును. పెడితే తీసుకోవచ్చు. పెట్టకపోతే కించపడకుండా వెళ్ళిపోవచ్చు. నాకు కావలసింది పూటకు పట్టెడన్నం. లోకంలో బిడ్డలనుకన్న తల్లులు లేకపోలేదు. వారం రోజుల్లో అలాంటి బ్రతుక్కు అలవాటు పడిపోయాను. ఆ వారం రోజుల్లో నాకో విషయం తెలిసింది. కాళ్ళూ చేతులూ దృఢంగా వున్న మానవుడు భిక్షానికి బయల్దేరితే లోకం ఈసడించుకుంటుంది. ఆ బ్రతుకుపైన రోత పుట్టింది. బస్సుస్టాండులో నిల్చుంటే మూట లెత్తడం, దించడం, మోయడంలాంటి చిన్న చిన్న గిరాకీలు తగులుతుండేవి. రోజుకొక రూపాయి కళ్ళకు కనిపించేది. అలాగే నాలుగైదు మాసాలు గడిచిపోయాయి. నాకు గడ్డం పెరిగింది. గుడ్డలు మాసి చిరుగులు పడిపోయాయి. తల వెంట్రుకలు బుట్టలా గుబురు కట్టిపోయాయి. అంతలో ఎండాకాలం పోయి వానాకాలం వచ్చింది, అవెక్కడి వానలో బాబూ, ఆ పట్టణంలో కుండలతో దిమ్మరించినట్టుగా జడివానలు కురిశాయి. వీధులు, మైదానాలు,

సైదు కాలువలు అన్నీ ఒక్క రీతిగా జలమయమైపోయాయి. ఓరోజు సాయంత్రం రోడ్డుపైన నడుస్తూ కాలుజారి క్రిందపడిపోయాను. పైకి లేచేసరికి ఒళ్ళంతా బురదతో దొప్పదోగి పోయింది. ఆ రాత్రి పడుకున్నానేగాని తడిబట్టల్తో నిద్ర పట్టిందిగాదు. తెల్లవారేసరికి జ్వరం వచ్చేసింది. నాలుగు రోజులు మూసిన కన్ను తెరవకుండా ఓ సత్రం వసారాలో పడి వుండిపోయాను. ఎవరో పుణ్యాత్ములు కొందరు దయతలచి నన్నో జట్కాలో వేయించి హాస్పిటలుకు చేర్పించారు. మందులూ, మాకులూ యిచ్చారో లేదో నాకు సరిగ్గా తెలియదు. ఇది మొండి ప్రాణం కనుక తేరుకున్నాను. జబ్బు నయమైపోయింది గనుక ఆసుపత్రినుంచీ వెళ్ళిపోవచ్చునన్నారు. ఎక్కడికి వెళ్తాను? నోరు విడిచి నా గోడు చెప్పుకోవాలనిపించింది. ఎవరు వింటారు? నా మాటలు వాళ్ళకు అర్థంకావు. వాళ్లు చెప్పేదేమిటో నాకు తెలియదు. కాళ్ళీడ్చుకుంటూ వీధులవెంట తిరిగాను. రాత్రి ఎనిమిది గంటలై ఉంటుంది. నా కాళ్ళు నన్ను రైల్వేస్టేషనులోకి తీసుకెళ్ళి వదలిపెట్టాయి. ఓ రైలు బయల్దేరడానికి సిద్ధంగా వుంది. ఆలోచించడానికి అవకాశమూ లేదు. ఓపికా లేదు. ఎక్కి కూర్చోగానే బండి కదిలింది.

"ఆ ప్రయాణం సాఫీగా జరగలేదు. మాటి మాటికీ దింపేశారు. మళ్ళీమళ్ళీ ఎక్కి కూర్చున్నాను. మన మనుషులు కనిపించేదాకా, మన మాటలు వినిపించేదాకా, మధ్యలో నేను ఆగదలచుకోలేదు. నాలుగోనాటి ఉదయం, భళ్ళు భళ్ళున తెల్లవారుతోంది. పెట్టెలోనుంచీ ప్లాట్‌ఫారంపైకి దిగాను. అల్లంతదూరంలో గుడిగోపురం కనిపించింది. దూరాన కొండ కనిపించింది. కొండపైకి వెళ్తున్న మెట్లు, మెట్ల చివర అలిపిరి గాలిగోపురం కనిపించాయి! చెవులకు నిండుగా గోవిందనామస్మరణం వినిపించింది. నాకు ప్రాణాలు లేచివచ్చాయి. ఆ ఆనందంలో ఊరంతా చెడ తిరిగేద్దామనుకొన్నాను. కానీ ఉన్నట్టుండి ఓ విషయం తలపుకు వచ్చింది. అన్ని ఊళ్ళలాంటిదిగాదు తిరుపతి. దేశంలో అన్ని మూలలనుంచి జనం అక్కడికి వచ్చిపోతుంటారు. ఆ వచ్చిపోయే వాళ్ళల్లో నాకు తెలిసినవాళ్లెవరైనా కనిపిస్తే? అందుకని ఊరికి దూరంగా వెళ్ళి ఓ చెట్టుక్రింద కూర్చున్నాను. మధ్యాహ్నం కావచ్చింది. కడుపులో కొక్కులు తవ్వుతున్నాయి. భోజనం కావాలి. అప్పుడు తిరుచానూరులో పెళ్ళిళ్ళు జరుగుతున్నాయి. నడవసాగాను. బయల్దేరిన వేళావిశేషం మంచిది. శుభకార్యం పూర్తిచేసుకుని తిరిగి వెళ్ళిపోవడానికి ముందుగా అందాలు ఖాళీచేస్తున్న ఓ పెళ్ళివారి కంటపడ్డాను. వాళ్ళ పాత్రల్లో మిగిలివున్న అన్నమూ, కూరా నారా అంతా ఓ విస్తరిలో వేసి నాకు వడ్డించేశారు. సుష్టుగా భోజనంచేసి ఎంతకాలమైందో మరి, ఒక విస్తరి మినహాగా మిగిలిందంతా మాయం చేసేశాను. పైకి లేచేసరికి పాదాలు గాలిలో తేలిపోతున్నాయి. శరీరంతోబాటు మనసుగూడా మైకంలో జోగుతోంది. బయటికి వచ్చాను. ఆ ఎండ ఎండలాలేదు నాకు, వెన్నెల్లా ఉంది. ఎట్టఎదుట కోనేరు, కోనేటి మెట్లపైన రావిచెట్టు నీడ. ఇంద్రుడి సింహాసనంలో కూర్చున్నా అంత సుఖంగా ఉండనిపించింది.

"ఆ సుఖంలో ఒకటి రెండు గంటలసేపు ఒళ్లు మరచిపోయాను.

"ప్రొద్దు గూట్లో పడింది. చలిగాలి ప్రారంభమైంది. తలకు చుట్టుకోడానికి పై గుడ్డలేదు. కప్పుకోడానికి ఏమీ లేకపోయినా నిద్రపోవడానికి అలవాటుపడ్డాను గనుక

పై గుడ్డ లేకపోవడం నాకొక యిబ్బందిగా తోచలేదు. అప్పుడు నా మనస్సు ఓ వస్తువుపైకి పోయింది. ఈ మనసుంది చూచావా రామం, దీనంత చెడ్డది వేరొకటి లేదు. కడుపు నిండుకూ తిండిలేక అలమటించినంతకాలం కూడే గుండెకాయగా, కడుపే కైలాసంగా రోజులు వెళ్ళబుచ్చాను. పెళ్ళి భోజనం కడుపులో పడిందో లేదో ఈ మనసు తనకింకొకటి తెచ్చి పెట్టమని హఠంపట్టి కూర్చుంది..."

రెండో పొగచుట్ట ముట్టించుకోడానికి మాధవయ్య మామ యిక్కడ కాసేపాగాడు. ఆయన మనసు దేనిపైకి వెళ్ళి ఉంటుందా అన్న నా ఆలోచన ఓ కొలిక్కి రాకమునుపే మళ్ళీ ఆయన కథలోకి వచ్చేశాడు.

"పొగచుట్టరా రామం, పొగచుట్ట! ఆ రోజుల్లో కానీకి రెండు చుట్టలు. కాని, కానీ కావాలి. ఎవరిస్తారు? చుట్టూరా కలయజూచాను. ఓ పెద్దమనిషి కనిపించాడు. అడిగితే చీదరించుకుంటాడేమో! బాబూ, కానీ ధర్మం చేయండి బాబూ అంటూ వెంట తగులకోడానికి నేను బొత్తిగా తెలుగుదేశపు బిచ్చగాణ్ణిలా లేను. అంతలో ఆ పెద్దమనిషి కనుమరుగై పోయాడు. ఇంకొకాయన దగ్గరికి వస్తున్నాడు. లేవబోయి మళ్ళీ మానేశాను. మనసేమో విడవకుండా మారాం చేస్తుంది. పొగచుట్ట! ఒక్కటే ఒక్కటి! కోనేటి నీటిపైనుంచీ విసురుగా వీస్తున్న చల్లటిగాలిలో పెదవులతో బిగబట్టి పొగ లోపలికి పీలుస్తూ అలాగే వదిలిపెడుతూ ఆనందంగా, ఆకాశానికి మూడే బారలన్నంత మహదానందంగా కూర్చోడానికి ఒక పొగచుట్ట!

"ఎవరో పిలుస్తున్నారు. ఎవరిని పిలుస్తున్నారు? వెనుదిరిగి చూచాను. ఎవడో బైరాగి. రావిచెట్టు మొదట కూర్చున్నాడు. బక్కపలచటి మనిషి. నల్లటి గడ్డం. జడలు గట్టిన తల. కావిగుడ్డలు. మోచేతి క్రింద దండం. చెంతనే కమండలం...

"నావైపే చూస్తున్నాడు. 'నిన్నే నాయనా! ఓ చిన్న సాయం చేస్తావా బాబూ?' అడగుతున్నాడు.

'సెలవివ్వండి స్వామీ?' అంటూ దగ్గరకి వెళ్ళాను.

"ఓ బేడ నాణాన్ని దోసిట్లో వేశాడు సన్యాసి.

"ఓ అణాకు పొగచుట్టలు, ఓ అగ్గిపెట్టె తీసుకొస్తావా బాబూ!" అన్నాడు.

"చిల్లరంగడి ఎంతో దూరంలేదు. అక్కడికి వెళ్ళి నిమిషాల్లో తిరిగి వచ్చాను. అగ్గిపెట్టెతో సహా చుట్టలను ఆయన ముందుంచి తీసుకోండి స్వామీ!' అన్నాను.

"నాకెందుకు బాబూ! నీ కోసమే తెమ్మన్నాను. తీసుకో' అన్నాడు బైరాగి. అనడమే గాదు, ఆయన మెల్లగా నవ్వుతున్నాడు.

"ఆశ్చర్యంతో బిర్రబిగుసుకుపోయాను. ఆశ్చర్యంలోనుంచి తేరుకోగానే సాష్టాంగంగా ఆయన పాదాలమీదికి వ్రాలిపోయాను. 'మూర్ఖుణ్ణి స్వామీ! అజ్ఞానంలో ఏదో అనుకున్నాను. నాది తప్పు. మన్నించండి.' అన్నాను.

"భుజంపై చేయివేసి ఆయన నన్ను లేపి దగ్గరగా కూర్చోబెట్టుకున్నాడు. ఓ పొగచుట్టను నా పళ్ళమధ్య యిరికించాడు. 'తప్పేముంది నాయనా! ఆ మాటకొస్తే మనసులోని కోరికను చంపుకోవడమే తప్పు! వేమన్న ఏమన్నాడు? 'కామిగాక మోక్షకామిగా'దన్నాడు' అంటూ ఆయన స్వయంగా అగ్గిపుల్ల గీసి నా చుట్టను వెలిగించాడు.

"కూర్చున్న చోటునుంచీ నేను లేవలేదు. జాముర్రాత్రి గావచ్చింది. చెట్టు మొదట కూర్చున్న సన్యాసిలో చలనం లేదు. కాస్త దూరంగా జరిగి అక్కడే పడుకున్నాను. తెల్లవారింది. నిద్రలేవగానే సన్యాసికోసం చూచాను. ఆయన అలాగే కూర్చుని ఉన్నాడు.

"ఆయనకు తిండీ నీళ్ళపైన ధ్యాసే ఉన్నట్టు లేదు. యాత్రీకులెవరైనా పళ్ళో ప్రసాదమో సమర్పించుకునేవారు. ఆయన తీసుకున్నది తీసుకోగా మిగిలింది నాకు దక్కేది. పనీపాటా లేదు. చీకూ చింతా లేదు. కాలమంతా అదే విధంగా గడచిపోతే బాగుండునని అనుకున్నాను.

"ఓ రోజు ఆయన కళ్లు దెరచి నావైపు చూస్తుండగా 'నా మనసులోని విషయం మీకెలా తెలిసింది స్వామీ?' అని అడిగాను.

"ఆయన చిత్రంగా సమాధానం చెప్పాడు – 'నువ్వెప్పుడైనా ఎక్స్‌రే ఫొటోను గురించి విన్నావా, నాయనా! ఆ ఫొటోలో శరీరం లోపలి భాగాలుగూడా స్పష్టంగా తెలిసిపోతాయి. అలాగే ఎదుటివారి మనసునుగూడా ఫొటో తీసినట్టుగా తెలుసుకోగల వెసులుబాటు లేకపోలేదు. కానీ అందుకు సాధన అవసరం!'

"ఆ సాధన ఏమిటో, దాన్నేవిధంగా చేయాలో, ఎంతకాలం చేయాలో నాకు తెలిసిందిగాదు. వివరంగా అడిగి తెలుసుకోవాలని మాత్రం అనుకున్నాను. కానీ ఆ తరువాత నేనెంతోకాలం ఆయనతో కలిసి ఉండడానికి వీల్లేకపోయింది..."

"ఏమైంది మామయ్యా? ఆయన ఏమయ్యాడు?" ఆతురతగా ప్రశ్నించాను.

మాధవయ్య మామ చెప్పసాగాడు: "ఓ రోజు రాత్రి, ఏడెనిమిది గంటలప్పుడు ఆయన తటాలున లేచి నిల్చుని చకచకా నడవసాగాడు. మారుమాటాడకుండా నేనూ ఆయన్ను వెంబడించాను. ఊరి బయటకు వచ్చాము. ఆయన ఒకచోట ఆగి వెనుదిరిగి చూస్తూ 'ఇక నువ్వు నీ దారంట వెళ్ళిపోవచ్చు.' అన్నాడు.

"నేను బెంబేలు పడిపోయాను. 'అదేమిటి స్వామీ! మీరే దిక్కని నమ్ముకున్నాను. మీతోనే ఉంటాను. మీ పాదసేవ చేసుకుంటాను' అని ప్రాధేయపడ్డాను.

"ఆయన జాలిగా నవ్వాడు. 'చూడు నాయనా! సంసారంనుంచి పారిపోయి వచ్చినవాడు సన్యాసి కాలేడు. భార్యపట్ల, బిడ్డలపట్ల, బంధుమిత్రులపట్ల తన కర్తవ్యాన్ని పూర్తిగా నెరవేర్చినవాడు మాత్రమే సన్యాసానికి అర్హుడు. వెలుగు చీకట్ల పడుగుపేకే జీవితం. వెన్నెల కొన్నాళ్ళు, చీకటి కొన్నాళ్ళు. నేను చెబుతున్నానుగా! నువ్వు స్వగ్రామానికి తిరిగి వెళ్ళు. అనుకోని విధంగా నీ కష్టాలన్నీ గట్టెక్కిపోతాయి..." అన్నాడు.

'వద్దు స్వామీ వద్దు! రొంపిలోనుంచీ బయటపడ్డాను. మళ్ళీ అక్కడకు వెళ్ళలేను. నన్ను మీ వెనువెంటనే వుండనివ్వండి' అని వే విధాలుగా చెప్పి చూచాను.

"కానీ ఆయన వినిపించుకోలేదు. 'ఒయి పిచ్చివాడా! నువ్వు విరాగివి కాదు. భయస్తుడివి. భయస్తుడెన్నడూ విరాగి కాలేడు. ఏనాడైతే నీకు నిజంగా వైరాగ్యం కలుగుతుందో ఆనాడు నా అంతట నేనుగా నిన్ను వెదుక్కుంటూ వస్తాను' అన్నాడు.

"ఇక నేను చెప్పగలిగిందేముంది రామం! ఏమీ చెప్పలేక చేతులు జోడించాను. ఆయన నన్నక్కడే వదిలిపెట్టి వడివడిగా నడిచి చీకట్లో కలిసి మాయమైపోయాడు. గుండె

రాయిచేసుకుని నేను మన వూరికి రాదలచుకున్నాను. చక్కా స్టేషనుకు నడిచాను. సరే, రైలుగూడా రానే వచ్చింది. ఎక్కి కూర్చున్నాను. మరునాటి మధ్యాహ్నానికల్లా మన ఊళ్ళో ఉన్నాను..."

స్వగ్రామానికి మరలివచ్చిన తరువాత తన జీవితంలో ప్రారంభమైన శుభ పరిణామాన్ని గురించి చెబుతున్నాడు మాధవయ్య మామ. ఆయన చెప్పకపోయినా ఆ వివరాలు నాకు తెలుసు. తిరిగి వచ్చిన కొత్తలో తన వాటాకు వచ్చిన తాతలకాలంనాటి పెంకుటింటి పెరట్లో అరటి పిలకలు పాతడంకోసం భూమిని త్రవ్వుతుండగా ఆయనకు అంతో యింతో బంగారం దొరికినట్లు చెప్పుకున్నారు. ఎలాగైతేనేం, కలిమి రాదలచుకుంది- నారికేళంలోకి సలిలంలా వచ్చేసింది. మాధవయ్యమామ అప్పులు తీర్చేశాడు. మేడలు కట్టాడు. పొలాలు కొన్నాడు. కొడుకుల్ని చదివించాడు. కూతుళ్ళకు పెళ్ళిళ్ళు చేశాడు. కొడుకులు పట్టణంలో ఉన్నతోద్యోగాలు చేస్తూ వుండగా, కూతుళ్లు లక్షణంగా తమ కాపురాలు చక్కదిద్దుకుంటూ వుండగా స్వగృహంలో దేవీ దేవరలాగా ఆలూ మగలిద్దరూ మాత్రం మిగిలారు.

మాధవయ్య మామ రెండోసారి వెలిగించిన పొగచుట్టకూడా సగానికి పైగా కాలిపోయింది. కానీ నా మనస్సులో మాత్రం పొగమబ్బులాంటి కుశంక ఒకటి మిగిలిపోయింది.

"ఆ సన్యాసి గనుక మళ్ళీ కనిపిస్తే నువ్వాయనతోగూడా వెళ్ళిపోతావా మామయ్యా?" విచారాన్ని అభినయిస్తూ ప్రశ్నించాను.

"అంతటి అదృష్టమా రామం! ఆయనకోసం ఎదురుతెన్నులు చూసీ చూసీ నా కళ్ళే కాయలు గాచిపోయాయి..." అన్నాడు మాధవయ్య మామ.

నాకు మాధవయ్య మామపైన కోపం కలిగిన మాట నిజం! చెప్పిచెప్పీ ఆయన తన కథకొక ముగింపు లేకుండా చేశాడు. పాపం, ఆయనమాత్రం ఏం చేస్తాడు? ఆ సన్యాసి తిరిగి వస్తేగానీ ఈ కథ పూర్తిగాదు. అతడెప్పుడు తిరిగి వస్తాడు? ఇంతకూ వస్తాడా, రాడా? అసలు అతడింకా బ్రతికి ఉన్నాడనుకోడానికి ఆధారమేముంది? ఈ ప్రశ్నావళికి ఏ వెండితెరపైన సమాధానం లభిస్తుంది?

***

ఆరోజు సాయంత్రం ఒంటరిగా షికారు బయలుదేరాను. ఊరు దాటగానే వానజల్లు ప్రారంభమైంది. బాటకు అనతిదూరంలోనే ఓ శివాలయం. లోకేశ్వరుడు మానవమాత్రుల భౌతిక నేత్రాలకు కనిపించకూడదనే గావచ్చు గర్భగుడి ఎప్పుడూ తాళం వేయబడి ఉంటుంది. గర్భగుడికెదురుగా ఓ మంటపం వుంది. పరుగెత్తికెళ్ళి ఆ మంటపంలో నిల్చున్నాను.

నాకంటే ముందుగా అక్కడ మరో వ్యక్తి తలదాచుకుని ఉన్నాడన్న విషయం వెళ్ళి నిల్చున్న కొంతసేపటికిగాని నాకు తెలిసిందిగాదు.

అతడు ఒక బైరాగి. మాధవయ్య మామ కథలో వచ్చిన బైరాగిది నల్లటి గడ్డమైతే, యితనిది తెల్లటి గడ్డం. అదొక్కటి మినహాయిస్తే ఆ వర్ణనకూ, యితనికీ అట్టే తేడా

కనిపించదు. గడ్డం మాటకేమీ, వయసు పైబడినకొద్దీ అది తెల్లబడిపోతుంది. కొంపదీసి అతడే యితడు కాదుగదా! నా వూహకు నేను నవ్వుకున్నాను.

అంతలో వేరొక ఊహ నా బుర్రలో తళుక్కున మెరిసింది.

"ఏ ఊరండీ?" దగ్గరగా వెళ్ళి పలకరించాను.

"సంసారికైతే ఒక ఊరు. సన్యాసి కేముంది? అన్ని వూళ్ళూ వాడివే!" అన్నాడు బైరాగి. అన్న తరువాత ఒకటి రెండు క్షణాలు తటపటాయించి "ఓ అణాకాసు యిస్తావా నాయనా! వేరుశనక్కాయలైనా కొనుక్కుంటాను" అంటూ పనిలో పనిగా తన స్వకార్యాన్ని చక్కబెట్టుకోడానికి ప్రయత్నించాడు.

పథకాన్ని అమల్లోపెట్టడానికి గూడా అదే సుమూర్తమనిపించింది – "అణాకాసుకేం భాగ్యంగానీ నేను చెప్పినట్టుగా చేస్తే నువ్వీ ఊళ్ళో ఓ వెలుగు వెలిగిపోవచ్చు..." అంటూ సాభిప్రాయంగా అతడివేపు చూచాను.

"నేనా! ఈ ఊళ్ళో వెలిగిపోవచ్చునా?" సన్యాసి తన చెవులను తానే నమ్మలేకపోయాడు.

"మరేంలేదు. సాధనా విధానం చాలా సులభం. నువ్వు నేర్చుకోవలసినవి మూడంటే మూడే మంత్రాలు. ఈ ఊళ్ళో మాధవయ్యగారని గొప్ప శ్రీమంతుడొకాయన ఉన్నాడు. ఆయనకు నీబోటి సన్యాసులంటే చెప్పరానంత గౌరవం. ఆయనగారి యిల్లెక్కడో చెబుతాను. మారుమాటాడకుండా వెళ్ళి నువ్వా యింటి వసారాలో తిష్ఠ వేసేయాలి. చీకటి పడేలోగా ఆయన నిన్ను పలకరిస్తాడు. పలకరించిన వెంటనే వీలైనంత స్పష్టంగా 'తిరుచానూరు కోనేటిమెట్లు' అంటూ మొదటి మంత్రాన్ని ఉచ్చరించాలి. 'ఏమిటేమిటీ?' అంటూ ఆయన విస్తుపోతాడు. 'మరచిపోయావా నాయనా?' అంటూ అప్పుడు రెండో మంత్రాన్ని ఒప్పజెప్పాలి. ఇక నోట మాటరాక చేష్టలు దక్కి ఆయన విగ్రహంలా నిల్చుండిపోతాడు, అప్పుడు మూడో మంత్రాన్ని అందుకోవాలి. 'నీకోసమే వచ్చాను నాయనా!' అన్నదే మూడో మంత్రం. ఈ చివరి మంత్రాన్ని మాత్రం రోజుకొకటి రెండుసార్లు తప్పనిసరిగా జపిస్తూ రావాలి..."

అనుమానంతో నావైపు ఎగాదిగా చూడసాగాడు సన్యాసి.

"ఊరికే ఉబుసుపోకకోసం చేస్తున్న పని. ప్రమాదమేమీ ఉండదు. పైగా ఎంతో కొంత ప్రతిఫలంకూడా ముడుతుంది. అందుకు నేను పూచీ" అంటూ నమ్మకం చెప్పాను.

ఏమైనా కానిమ్మని సాహసకృత్యానికి పూనుకుంటున్నవాడిలా ముగ్గులోకి దిగడానికి ఉద్యుక్తుడయ్యాడు సన్యాసి.

ఎందుకోగాని నాకు అమందానందం కలిగింది. ఎందుకో అని వితర్కించుకున్నాను. మాధవయ్యమామ కథ ఏనాడో ఆగిపోయింది. అదింక ముందుకు సాగి ఓ ముగింపుకు చేరుకునే అవకాశాలు లేనేలేవని అనుకున్నాను. కానీ కాకతాళీయంగా ఈనాడా కథకు కాళ్ళొచ్చేశాయి. ఇదింక ఎలా నడుస్తుందో చూడాలి...

***

మరునాడు తెల్లవారేసరికి మా ఊళ్ళో ఒకటే కోలాహలం – మాధవయ్యగారింటికి ఎవరో మహనీయుడు వచ్చేశాడు. ఆయన అగత అనాగతాలను కళ్ళు మూసుకుని

చెప్పెయ్యగలడు. ఆయన మంత్రించిన విబూదిని ప్రసాదిస్తే తీరని వ్యాధులన్నీ నయమైపోతాయి. ఇంకా రకరకాల చిలువలతో పలవలతో ఆయన ప్రభావాన్ని గురించి ప్రచారం కొనసాగుతోంది.

నామట్టుకు నేను మాత్రం యిప్పుడిప్పుడే మాధవయ్య మామగారింటికి వెళ్ళదలచుకోలేదు. కానీ అక్కడ వర్తమానాలు మాత్రం నా చెవిదాకా వస్తూనే ఉన్నాయి. మాధవయ్య మామ స్వాముల వారికి మేడపైన విడిది ఏర్పాటు చేశాడు. స్వామి స్నానపాన భోజన వగైరాలన్నీ ఆయనకక్కడే జరిగిపోతున్నాయట. స్వాములవారి వాగమృతాన్ని గ్రోలడానికి, ఆయన అనుగ్రహానికి నోచుకుని భవబాధలనుంచి విముక్తి పొందడానికి వెళ్తున్న జనంతో ఆ యిల్లు కిటకిటలాడిపోతోందట!

స్వాములవారి ఆగమనానికి మరింత ప్రాధాన్యం లభించడానికి వాతావరణ పరిస్థితి కూడా అనుకూలించిందనే చెప్పాలి! ఆయన రాబోతున్నాడనగా పట్టుకున్న వాన ముసురా నాలుగు రోజులదాకా అలాగే మొరాయించుకుని ఉండిపోయింది. ఎడతెరిపి లేకుండా పడుతున్న వానజల్లులవల్ల ఎవరి పనులు వాళ్ళు చేసుకోడానికి వీల్లేకపోవడంతో ఆబాలగోపాలానికి స్వాములవారిని గురించిన చర్చ తప్పితే మరొక ధ్యాస లేకపోయింది. అవి నేను నిరుద్యోగంతో కాలహరణం చేస్తున్న రోజులు. మూడేళ్ళుగా యింటిదగ్గర కూర్చుని ప్రతి సంక్రాంతికీ గోడలకు వెల్లవేసినట్టుగా ఏడాదికొకసారి నామధేయాన్ని 'రెన్యూ' చేయించుకుంటూ ఎంప్లాయిమెంటువారికి కాస్తో కూస్తో పని కల్పిస్తున్న నాకు ఒకనాటి శుభోదయాన బీటలువారిన నేలపైన తొలి ముంగారు వానలు కురిసినట్టుగా, ఉత్తరువు చేతికొచ్చేసింది. భోజనానికి రావచ్చునని ఎలుగెత్తి పిలిచి దభీమని తలుపు వేసుకున్న అన్నదాతకు, ఆ ఉత్తరవు జారీచేసిన అధికారులకు దగ్గరి చుట్టరికం ఉందేమో నాకు తెలియదు. కాగితం చేతికందిన తర్వాత కొన్ని గడియల వ్యవధిలో బయల్దేరితేగానీ నేను యింటర్వ్యూకు హాజరుకాలేను. అదృష్టం బాగుండి యింటర్వ్యూలో ఎన్నిక చేయబడితే వెంటనే ఉద్యోగంలో చేరిపోవలసి ఉంటుంది.

ఈ రోజుల్లో వలచిన వనిత దొరకడంకన్నా కోరిన ఉద్యోగం దొరకడం కష్టం. ఎలాగైతేనేం కోరిన కొండలో వాన కురిసింది. ఉద్యోగంలో చేరిపోయాను.

తరువాత నెల రోజులకుగానీ మా వూరికి తిరిగి రావడం కుదిరింది కాదు. రాగానే మాధవయ్య మామగారింటికి బయల్దేరాను.

సంజెచీకట్లు ముసురుకుంటున్న మునిమాపువేళ. నేరుగా యింటి లోపలికి వెళ్ళిపోబోతూ వసారాలో ఏదో ఆకారం మెదిలినట్టుగా తోచి అటువేపు తిరిగి చూసాను. తుపానులో తడిసి ముప్పందుమైపోయి చేనిగట్టుపైన గడగడా వడకిపోతూ కూర్చున్న గరుడపక్షిలా ఒంటి నిండుకూ దుప్పటి కప్పుకుని లోతుకుపోయిన కళ్ళతో బిక్కుబిక్కుమని చూస్తున్న మానవుడెవరో కాదు – మా మాధవయ్య మామ!

"అదేమిటి మామయ్యా! ఇలాగై పోయావేమిటి?" అంటూ పరామర్శించాను.

"ఎప్పుడొచ్చావురా రామం! ఎందుకోగానీ ఇలాగైపోయాను మరి!" నీరసంగా బదులుచెప్పాడు మాధవయ్య మామ.

తులసమ్మత్త నన్ను దూరంగా తీసుకెళ్ళింది – "ఇదేం విపరీతం నాయనా! సమయానికి నువ్వుగూడా ఊళ్ళో లేకుండా పోయావు. ఇతగాడెవరోగాని పులిమీద పుట్రలా దాపురించాడు. మీ మామయ్య కంటికి కనిపిస్తే చాలు, నీకోసమే వచ్చానంటాడు. అదేం కర్మమో మరి. పెద్దపులిలాంటి మనిషి అతగాడి దగ్గరీయన పిల్లిలా మారిపోతారు. నిద్రాహారాలు మానేసి నెలనాళ్ళయింది. చూచావుగా, మనిషి చిక్కి సగమైపోయారు. నాకైతే దిక్కులే తోచడం లేదు..."

మెల్లగా మేడపైకి వెళ్ళాను. విశాలమైన హాల్లో చిన్న దీపం వెలుగుతోంది. అగరొత్తుల పరిమళం హాలంతటా సుళ్లు తిరుగుతోంది. బల్లపైన పళ్ళెం నిండుకూ పళ్ళు. వెండి పాత్ర నిండుకూ పాలు. పట్టెమంచంపైన తెల్లటి దూదిపరుపు. తలగడ కానుకుని సుఖాసీనుడై ఉన్నాడు సన్యాసి. ఆనందపారవశ్యంవల్ల కాబోలు, అతనివి అరమోడ్పు కన్నులు. పొడుగాటి గడ్డం గాలికి మెల్లగా కదులుతోంది.

ఎదుటికి వెళ్ళి నిల్చోగానే ఆయన యోగనిద్ర చెడిపోయింది.

"జ్ఞాపకమున్నానా స్వామీ!" అన్నాను.

కట్టను త్రెంచుకున్న ప్రవాహంలా నన్ను పోల్చుకోగానే ఆయన హావభావాలుకూడా హద్దులు దాటిపోయాయి. "నువ్వా నాయనా! ఎన్నాళ్ళకెన్నాళ్ళకు?" అంటూ ఆయన నన్ను దగ్గరికి తీసుకుని ఆలింగనం చేసుకోబోయాడు. "నీ మేలు మరిచిపోను బాబూ?" అంటూ చేతులు జోడించి అంజలి ఘటించబోయాడు. అలాంటి చేయరాని పనులేవీ చేయవద్దని ఆయన్ను బ్రతిమాలుకోవలసి వచ్చింది.

"ఎందరెందరో యిక్కడకు వచ్చారు గానీ నువ్వు మాత్రం కనిపించావుగావు. ఎవరినైనా అడుగుదామనుకుంటే నీ పేరైనా తెలిసిందిగాదు..."

ఆయన్ను వారించి అసలు విషయంలోకి వచ్చేశాను.

"గడచిన గాథను త్రవ్వుకోకండి స్వామీ! జరగవలసిందేమిటో ఆలోచించండి. ఏ వ్యవహారంలోనైనా సరే పట్టువిడుపులు రెండూ ఉండాలి. తెగేదాకా లాగడం మంచిదిగాదు. మొదటికే మోసం రావచ్చు. ఇప్పటికే శృతిమించి రాగాన పడింది. వీలైనంత త్వరగా మనం రంగంనుంచీ నిష్క్రమించడం మంచిది..."

"బాబ్బాబూ! అంతమాట వొద్దు. ఏదో పచ్చని పట్టు దొరికింది. నిర్విచారంగా కాలం గడిచిపోతోంది" అంటూ గింజుకున్నాడు సన్యాసి.

అప్పుడు నేను హితవును, వేదాంతాన్ని సమపాళ్ళతో కలిపి నా వోపినంతలో ఉపదేశానికి పూనుకోవలసి వచ్చింది.

"చూడండి స్వామీ! దేశమంతా మీది.మానవులందరూ మీవారు. మీ సాన్నిధ్యమూ, మీ సాహచర్యమూ ఒక ప్రదేశానికి, ఎవరో కొందరు మానవులకు పరిమితం కారాదు. ఒకానొక ప్రదేశంపట్ల మమకారం, ఒకానొక సుఖంపట్ల లోలుపత్వం – యివన్నీ బంధహేతువులు. మాటవరుసకు చెబుతున్నాగానీ ఈ విషయాలు మీకు తెలియనివి గావు. నోరువిడిచి వీళ్ళు వెళ్ళిపొమ్మని చెప్పలేదుగదా అని తామసించడంగూడా భావ్యం కాదు. ఉదాసీనమే వీడుకోలని పెద్దలు చెప్పనే చెప్పారు. అయినా ఈ మాయాజగత్తులో

సుఖానికీ, సంతృప్తికీ అవధులెక్కడ? ఏనాటి కేది అనుగ్రహింపబడితే దానితోనే సుఖానికీ, సంతృప్తికీ గిరిగీసుకోవడం మీబోటి విరాగుల స్వభావం..."

శ్రద్ధగా ఆలకించాడు బైరాగి. "నిజమే నాయనా! నువ్వు చెప్పినట్టే చేస్తాను. ఈ వూళ్ళో నాకు తెల్లవారదు. మరెక్కడో తెల్లవారుతుంది" అంటూ నాకు అభయమిచ్చాడు.

తెల్లవారింది. పట్టెమంచంపైనే కాదు సరికదా, ఊరి పొలిమేరల్లోపల సన్యాసి జాడలేదు.

మాధవయ్య మామ క్రమక్రమంగా కోలుకోసాగాడు.

❖ ఆంధ్రపత్రిక - 13 సెప్టెంబర్, 1961 ❖